స్నేహమేరా జీవితం

- అభాగ్యులకు అండగా పలు సేవా కార్యక్రమాల్లో స్నేహితులు
- నేడు స్నేహితుల దినోత్సవం



అన్నదానం చేస్తున్న స్నేహితులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వారంతా బాల్య స్నేహితులు. అతి సాధారణ కుటుంబానికి చెందినవారు. ముత్యాలంపాడు జెండా చెట్టు వీధి సమీపంలో కలిసి చదువుకున్నారు. కలిసిమెలిసి తిరిగారు.. ఆడి పాడి సందడి చేశారు. పెద్దయ్యాక సమాజంలో ఉన్న సమస్యలు, అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులు, వృద్ధులను చూసి ఏదైనా సమాజానికి అవసరమైన సేవ చేయాలని స్నేహితుల్లో ఒకరైన కోరంగి నాగమల్లీశ్వరి, తోటి స్నేహితుడు షఫీతో చెప్పారు. దీంతో వారిద్దరు కలిసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి తోటి స్నేహి తులు తాము కూడా సేవల్లో పాల్గొంటామంటూ తలో చెయ్యి వేశారు.

అనాథలకు అన్నదానం, నిరుపేదలు, హెచ్ఐవీ, టీబీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితం ఇద్దరు స్నేహితులతో ప్రారంభమైన వీరి పయనం ప్రస్తుతం 32 మందితో కొనసాగుతోంది. 2021లో హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి సేవలను మరింత విస్తృతం చేశారు. వీరి సేవా కార్యక్రమాలను చూసి తోటి స్నేహితులు, సేవాతత్పరులు కూడా ట్రస్టుకు సేవలు అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి అనాథలు, వృద్ధులను ఆదరిస్తామని వీరు ధీమాగా చెబుతున్నారు.



బెస్ట్ సొసైటీ పురస్కారం అందజేస్తున్న ఏపీశాక్స్ అధికారులు

వరించిన పురస్కారాలు

ట్రస్ట్ పేరిట చేస్తున్న సేవాకార్యక్రమాలకు గానూ ఏపీస్టేట్ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ బెస్ట్ సొసైటీగా పురస్కారం అందజేశారు. అలాగే 48 సార్లు రక్తదానం చేసిన షఫీకు సర్టిఫికెట్ పురస్కారం అందజేశారు. సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న కోరంగి నాగమల్లీశ్వరికు హోప్‌థియోలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

సాయం చేయడమే నిజమైన స్నేహం



పేదరికంలో ఉన్న వృద్ధులను చూసి మనసు చలించిపోయింది. దీంతో మా స్నేహితుల సహకారంతో వారికి అవసరమైన సేవలు అందించడం ఆనందంగా ఉంది. ఎవరికి వారు తాము సంపాదించిన మొత్తంలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు అందిస్తున్నారు. వారు సంపాదించే దానిలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు కేటాయించటం అభినందనీయం.

– కోరంగి నాగమల్లీశ్వరి, ట్రస్ట్ ఫౌండర్

ఫ్రెండ్స్ అందరం కలిసిమెలిసి పనిచేస్తాం



మొదటి నుంచి మా ఫ్రెండ్స్ అందరం కూడా ఎవరికి సమస్య వచ్చినా స్పందించే వాళ్లం. అవసరంలో ఉన్న వారికి సాయం చేయడంతో పాటు ఇప్పటికే నేను 48 సార్లు రక్తదానం చేశాను. మేం ఏ పని తలపెట్టినా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పనిచేస్తాం. ఎవరికైనా రక్తం అవసరమైతే మా ఫ్రెండ్స్‌లో ఎవరో ఒకరు ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్‌కే షఫీవుల్లా, ట్రస్ట్ ఫౌండర్

అన్నింటి కన్నా స్నేహమే మిన్న



జీవితంలో ఎంత సంపాదించినా కలగని ఆనందం మా స్నేహితులతో కలిసి నేను చేస్తున్న సేవా కార్యక్రమాలతో కలుగుతుంది. నా బాల్య స్నేహితులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయటానికి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్‌కే రహీమా, ట్రస్ట్ మెంబర్

నాడు పార్క్ కోసం పోరాటం- నేడు ఫుడ్ కోర్ట్ కోసం ఆరాటం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే బైపాస్ రోడ్డులో ఫుడ్‌కోర్టు ఏర్పాటు ప్రతిపాదనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గొల్లపూడి మైలు రాయి సెంటర్ నుంచి విద్యాధరపురం సితార జంక్షన్ వరకు ఉన్న బైపాస్ రహదారి అభివృద్ధిని విస్మరించిన పాలకులు ఇప్పుడు అదే రహదారిలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. విద్యాధరపురం సితార జంక్షన్‌కు ఒక వైపు లక్ష్మీనగర్ కాలనీ, బాలాజీనగర్, మరో వైపు మిథిలానగర్, ఇంకో వైపు లేబర్‌కాలనీ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలో పార్క్ లేదని, సితార జంక్షన్ నుంచి కబేళా రోడ్‌లోకి వెళ్లే మలుపులో పార్క్ ఏర్పాటు చేయాలని నాడు పోరాడి సాధించుకున్న వారే నేడు అదే ప్రాంతంలో ఫుడ్‌కోర్ట్ ఏర్పాటుకు ఆరాటపడుతుండటం గమనార్హం. వాస్తవానికి భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లో కృష్ణానదీ తీరాన ఉన్న పున్నమి ఘాట్‌లో ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. అందులో భాగంగానే గతంలో నగరపాలక సంస్థ ట్రయల్ కూడా వేసింది. పేరొందిన హోటల్స్‌తోపాటు చిరు వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేసి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని వదిలేసి హైవేను ప్రతిపాదించడం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రాంతంలో ఫుడ్ కోర్టు వద్దన్న స్థానికుల వినతి మేరకు ఇటీవల అక్కడికి వచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి 'ఇక్కడ మురుగులో ఫుడ్ కోర్ట్ ఏమిటి.. ముందు బైపాస్ రోడ్‌ను అభివృద్ధి చేసిన తరువాత అప్పుడు ఆలోచిద్దాం' అని వ్యాఖ్యానించడం గమనార్హం.


ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలనుకుంటున్న సితార జంక్షన్‌లోని పార్క్ కోసం కేటాయించిన స్థలం

9న లలితాంబికా పీఠంలో ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ పౌర్ణమి శ్రీలలితాంబికా అమ్మవారి జయంతిని పురస్కరించుకుని పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య తెలిపారు. పాలప్రాజెక్టు సిబ్బంది క్వార్టర్స్ సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో శనివారం ఉదయం 8.30 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు పీఠాధిపతి శివలీలా మాతాశ్రీ పర్యవేక్షణలో గణపతి పూజ, సహస్ర కలశాభిషేకం అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ పూజలు ఉంటాయన్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, శ్రీ లలితాంబిక, ఖడ్గమాలాలర్చన, హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పూజా కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

సెకండ్ స్కిన్ చీరల ప్రదర్శన, విక్రయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో హైదరాబాద్ నుంచి వచ్చిన సెకండ్ స్కిన్ ప్రత్యేక చీరల ప్రదర్శన, విక్రయాలు శనివారం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి సేకరించిన అద్భుతమైన చేతిపని నేసిన చీరల సేకరణను చూడొచ్చన్నారు. పటాన్ పట్టోలా, బెనారస్, కటాన్ సిల్క్, టుస్సార్ జార్జెట్, కాటన్ జంఘాని, మష్రూ సిల్క్, ఆర్గంజా, గద్వాల్, కంచీవరం, రాజ్‌కోట్ పట్టోలా, చందేరి, క్రేప్ ఇతర ఫ్యాన్సీ చీరలు ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆదివారం కూడా ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని ఓవ్యక్తి గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది.పోలీసుల కథనం ..అంబాపురం పంచాయతీ కార్యాలయం ప్రాంతానికి చెందిన గద్దల వెంకటశివప్రసాద్ పాలప్రాజెక్టులో పనిచేస్తుంటాడు. శనివారం డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, నైనవరం ఫ్లైఓవర్ దిగిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటశివప్రసాద్‌కు గాయాలయ్యాయి. బాధితుడు తన బంధువులకు ఫోన్‌చేయగా వారు హుటాహుటిన వచ్చి అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'రమణీయం' పుస్తకావిష్కరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమకాలీన సమస్యలపై సీనియర్ పాత్రికేయులు యేమినేని వెంకటరమణ రచించిన 'రమణీయం' పుస్తకాన్ని పాతబస్తీ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం పీఠాధిపతులు శ్రీకరుమారి దాసు తొలి ప్రతిని స్వీకరించి రచయిత రమణకు ఆశీస్సులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, హిందూహైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు చెవుల ఆంజనేయులు, చింతల పూడి సత్యనారాయణ, గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎస్.సూర్యారావు హాజరై ప్రసంగించారు. 'రమణీయం' పుస్తకావిష్కరణకు తోడ్పాటు నిచ్చిన ప్రతి ఒక్కరికి రచయిత వెంకటరమణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్

ఒక్క రూపాయికే సిమ్, 30 రోజుల ఫ్రీ కాల్స్, డైలీ 2 జీబీ డేటా


మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశ వ్యాప్తంగా 4జీ సేవలను ప్రారంభించటంతో పాటు ఆత్మనిర్భర భారత్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ ప్రారంభించినట్లు ఏపీ సర్కిల్ బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బుంగా రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌లో కేవలం ఒక్క రూపాయికే సిమ్, 30 రోజుల ఫ్రీ కాల్స్, డైలీ 2 జీబీ డేటా అందిస్తామన్నారు. ఈ అవకాశం కొత్తగా సిమ్ తీసుకునేవారితో పాటు వేరే నెట్‌వర్క్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్టబిలిటీ ద్వారా వచ్చేవారికి వర్తిస్తుందని చెప్పారు. ఈ ఆఫర్ ఈ నెల 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉచిత సిమ్, బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ కోసం బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ ఫ్రీడమ్ ప్లాన్‌తో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సెక్టార్-1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం భవానీపురం వెలంపల్లి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తల్లి పాల విశిష్టతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి పాలు పట్టించాలన్నారు. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. తద్వారా బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె.సునీత, ఆశవర్కర్ హేమలత, ఎమ్ఎస్‌కె గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు ఎ.ఉమాదేవి, ఎ.సుభాషిణి, ఎస్‌కె అమిత, వి.వరకుమారి పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ప్రశాంతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


పండ్ల వేషధారణలో చిన్నారి విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం ఫ్రూట్స్ డే వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల ఫ్రూట్స్ వేషధారణలో ఉన్న చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్లినికల్ డైటీషియన్ శ్రావణి పంచకర్ల, పాఠశాల కరస్పాండెంట్ టీ సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ టీ మోనిక సుమన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పండ్లలో ఉన్న పోషకాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి బెరంపార్క్‌లో నృత్య పోటీలు

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఆదేశాల మేరకు భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లాసికల్, జనరల్, సోలో, గ్రూప్ డాన్స్ పోటీలు ఉంటాయన్నారు. ఆరేళ్లలోపు, ఏడు నుంచి పదేళ్లలోపు, 11నుంచి 15ఏళ్లలోపు, 16ఏళ్లు ఆపైబడిన వారు ఓ కేటగిరీ చొప్పున మొత్తం నాలుగు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల మూడోతేదీ మొదటి కేటగిరీ పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతి ఆదివారం ఒక్కో కేటగిరీ చొప్పున పోటీలు ఉంటాయన్నారు. ముగింపు కార్యక్రమాన్ని ఐదో ఆదివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ విరించారు.

దాతల సహకారం ఎనలేనిది



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భక్తుల సౌకర్యార్థం రూ.2లక్షల వ్యయంతో దాతలు షెడ్డు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని దేవస్థాన ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు కొనియాడారు. చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద దేవస్థాన కమిటీ శనివారం పూజలు నిర్వహించారు. తిరుమలకొండ దుర్గారావు, నవీన్ తమ తండ్రి వేణుగోపాలరావు పేరిట ఈ షెడ్డును నిర్మించడం హర్షణీయమంటూ కమిటీ సభ్యులు వారికి అభినందనలు తెలియజేశారు. ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, సుదురుపాటి కృష్ణప్రసాద్ శర్మ, రెంటచింతల విశ్వనాథ శర్మ, భోగవల్లి సురేష్, మరుపిళ్ల రామకృష్ణ, పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బావపై బావమరుదులు దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను మందలించిన భర్తపై ఆమె సోదరులు, బంధువులు దాడి చేసిన ఘటన భవానిపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భవానిపురానికి చెందిన అనిల్‌కుమార్ పెయింటింగ్ వర్క్స్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య వేరే వ్యక్తితో మాట్లాడడం చూసి మందలించాడు. దీంతో తనను మందలించిన విషయాన్ని ఆమె తన పుట్టింటి వాళ్లకు చెప్పడంతో ఆమె సోదరులు నరేష్, గోపి, బంధువులు రాంబాబు, కృష్ణ, శ్రీను అనిల్‌కుమార్ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి అతనిపై దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం నఇన్వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భవానీపురం ఎస్ఐ పి.ప్రకాశరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. డీన్ రంగారావు, ప్రిన్సిపాల్ జీ ప్రదీప్ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఎదిగినవారే ప్రయోజకులు అవుతారని పేర్కొన్నారు. తొలుత విద్యార్థినులు మహతి, శాన్విశ్రీ, హిమబిందుల భరతనాట్యం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, కోఆర్డినేటర్ సురేష్, రాము పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ, స్కూల్ బస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కారును లారీ, స్కూల్ బస్సు ఢీ కొట్టిన ఘటన గొల్లపూడి మైలురాయి సమీపంలో శనివారం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన మందడపు శ్రీరామ్ కుటుంబంతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు విజయవాడ వచ్చారు. దర్శనం చేసుకుని తిరిగి వెళుతూ గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు చేరుకునే సమయంలో అతి వేగంగా వచ్చిన లారీ, వీరి కారును ఢీకొట్టింది. దీంతో కారు కుడి భాగం పూర్తిగా దెబ్బతింది. కారును పరిశీలిస్తుండగా .. అదే సమయంలో ఎడమ వైపు వచ్చిన స్కూల్ బస్సు కారు బంపర్‌ను ఢీకొట్టింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మల్లాది శత జయంతి సభ

విజయవాడకల్చరల్: శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఆధ్యాత్మికవేత్త, శృంగేరీ పీఠం, టీటీడీ ఆస్థాన విద్వాంసులు మల్లాది చంద్రశేఖర శాస్త్రి శతజయంతి సభను నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య శలాక రఘునాథశర్మ, విశ్వనాథగోపాలశర్మ, ఆంజనేయ ఘనాపాటి, తంగిరాల రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు. మల్లాది అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నాటక రంగ పురోగతికి బళ్లారి రాఘవ ఎనలేని సేవలు


బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీపీ సరిత


బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాటక రంగ పురోగతికి ఎనలేని సేవలు అందించిన వ్యక్తి బళ్లారి రాఘవ అని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నాటకాలపై ప్రత్యేకాభిమానం, ప్రతిభతో తన సమయాన్ని, సంపదను ఆ రంగ అభివృద్ధికి కేటాయించారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో తెలుగు నాటకరంగ ప్రముఖుడు, న్యాయవాది బళ్లారి రాఘవ 145వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి రాఘవకు నాటక రంగంపై ఆసక్తి ఉండేదని, ఆయన ఆసక్తిని గుర్తించిన ఆంధ్ర నాటక పితామహునిగా పేరొందిన ఆయన మేనమామ ధర్మవరం రామకృష్ణమాచార్యులు ప్రోత్సహించారన్నారు. 12వ ఏటా మొదటిసారి రంగస్థలంపై నటించి, నాటక రంగంలో సంచలనాలను సృష్టించి సినిమా రంగం వైపు వెళ్లిన గొప్పనటులు రాఘవ అని అన్నారు. విశాలమైన ఆలోచనలతో జాతి ప్రగతికి, మూఢాచారాల నిర్మూలనకు నాటకరంగం ప్రధాన సాధనమని భావించి నాటకరంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని కలెక్టర్ కొనియాడారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రముఖ నాటక రచయిత, నటుడు, సంఘసేవకుడు బళ్లారి రాఘవ జయంతిని శనివారం నిర్వహించారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి అడ్మిన్ డీసీపీ కెజివి సరిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి మాత్రమే కాకుండా సమాజాభివృద్ధికి కూడా అత్యంత గొప్ప సేవలు అందించారన్నారు. ఆయన రచనలు నేటికీ సమాజాన్ని చైతన్యపరుస్తున్నాయన్నారు. నాటక రూపంలో సామాజిక సమస్యలను ప్రదర్శిస్తూ ప్రజలకు స్పష్టమైన సందేశాలను అందించిన గొప్ప నాటక కళాకారుడు అని కొనియాడారు. బళ్లారి రాఘవ జీవిత విశేషాలను గుర్తు చేసుకుంటూ ఆయన నటనలోని సహజత్వం, రచనలలోని సంస్కార బోధనలు, సామాజిక విలువలను గురించి నేటి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

కృష్ణానది పరివాహక ప్రాంతాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): వరద నీరు నివాస ప్రాంతాల్లోకి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం కృష్ణానది పరివాహక ప్రాంతాలైన పున్నమిఘాట్, భవాని ఘాట్, సీవీఆర్ ఫ్లైఓవర్, ఊర్మిళ సుబ్బారావు నగర్‌లో ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాలలో ముందస్తు చర్యల్లో భాగంగా ఆయిల్ ఇంజిన్‌లు, ఇతర యంత్రాలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. వరద నీరు ప్రవాహం నివాస ప్రాంతాలకు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఫ్లడ్ డ్యూటీ టీమ్స్‌ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఊర్మిళ సుబ్బారావు నగర్, సివిఆర్ ఫ్లై ఓవర్ మేజర్ ఔట్ ఫాల్ డ్రైయిన్లలో సాగుతున్న డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలో డీసిల్టింగ్ పనులను నిరంతరాయంగా చేస్తుండాలని ఎప్పటికప్పుడు సిల్ట్‌ను తీస్తూ నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, డిప్యూటీ సిటీప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది ఉన్నారు.


పున్నమిఘాట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కాటన్ సీడ్ ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఓ హోటల్‌లో ఆరో కాటన్ సీడ్ ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్-2025 శనివారం ప్రారంభమైంది. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఇఏ), ఆల్ ఇండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్(ఏఐసీఓఎస్‌సీఏ)ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కాంక్లేవ్‌ను ముఖ్య అతిథి, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఖాదీ అండ్ గ్రామీణ పరిశ్రమ కమిషన్ సీఈఓ రూప్‌రాశి లాంఛనంగా ప్రారంభించారు. సదస్సులో కాటన్ సాగు, పంట సాగు అనంతర నిర్వహణ, ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్‌లో నూతన సాంకేతికత, పశువుల ఆహార ఫార్ములేషన్లు, స్మార్ట్ ప్యాకేజింగ్, బ్రాండింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెట్, ఫోర్కాస్టింగ్ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. కాటన్ సీడ్ ఆయిల్ రుచిలోనూ, వాసనలోను ప్రామాణికంగా ఉంటుందన్నారు. ఆసియా వంటకాలలో ప్రధాన పదార్థంగా ఉందన్నారు. కాటన్ సీడ్ మీల్ కూడా పశువులకు అద్భుతమైన ఆహారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రీ ఎఫ్ సంస్థ(తాడేపల్లిగూడెం) డైరెక్టర్ ఓపి గోయెంకా, ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఎస్ఈఏ ఉపాధ్యక్షుడు అంగ్షూ మల్లిక్, సందీప్ బజోరియా పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కాంక్లేవ్‌ను ప్రారంభిస్తున్న రూప్‌రాశి, ధూళిపాళ్ల నరేంద్ర, అంగ్షూ మల్లిక్ తదితరులు

పింగళి వెంకయ్య సేవలు స్ఫూర్తిదాయకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కూరపాటి చంద్రశేఖరరావు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య పేర్కొన్నారు. పాఠశాలలో పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ యుగంధరాచార్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య భట్లపెనుమర్రులో నిరుపేద రైతు కుటుంబములో జన్మించారని, 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో నిర్వహించిన సమయంలో గాంధీజీ కోరిక మేరకు పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించారని వివరించారు.పింగళి వెంకయ్య జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు బహుమతులు అందజేశారు.


బహుమతులు సాధించిన విద్యార్థులు

15న అష్టలక్ష్మీ సహిత, శ్రీ మహాలక్ష్మి యాగం

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా 15వ తేదీ శుక్రవారం ఉదయం గాంధీనగర్‌లోని కొత్త పూర్ణానందం కళా వేదికపై హోమ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్, ఉపాధ్యక్షుడు కేవీబీ రాజేష్ తెలిపారు. కార్యక్రమానికి హిందూ బంధువులందరూ సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని సూచించారు. పేర్ల నమోదుకు 96181 93027, 92461 93903 నంబర్లకు సంప్రదించాలని కోరారు.